క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న పవన్ భార్గవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వేంపల్లె : అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కడప అక్కాయపల్లెకు చెందిన వడ్డెమాని పవన్ భార్గవ్‌రెడ్డి 27వ జయంతి సందర్భంగా తల్లిదండ్రులు వి.లక్ష్మీదేవి, కాంట్రాక్టర్ వడ్డెమాని రామలింగారెడ్డిలతోపాటు కుటుంబ సభ్యులు చింతకొమ్మదిన్నెలోని గంగమ్మ తోపులోని ఆంజనేయస్వామి ఆలయం, వేంపల్లె రాజీవ్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమం, కడప అజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమం, ఇందిరానగర్ లోని పద్మావతి వెంకటేశ్వర ఉచిత వృద్ధాశ్రమాల్లో అనాథ వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు.

వంట గ్యాస్ సిలిండర్‌కు వర్ధంతి



గ్యాస్ సిలిండర్లకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వేంపల్లె : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ.50 పెంచినందుకు నిరసనగా శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు వంట గ్యాస్ సిలిండర్‌కు వర్ధంతి జరిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డిలు నిరసన వ్యక్తం చేశారు. పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్‌ఎంయూ నిరసనలు



డిపో గ్యారేజ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జమ్మలమడుగు : తమ డిమాండ్‌లను పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఎన్‌ఎంయూ నాయకులు గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి శివుడు మాట్లాడుతూ ఏపీ పీటీడీ ఉద్యోగుల సమస్యల కోసం యాజమాన్యం ప్రభుత్వం మొగ్గుచూపడంలేదన్నారు. కొంత కాలంగా నిలిచి పోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డెలికెట్ కాంతయ్య, రీజనల్ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, గ్యారేజి కార్యదర్శి వలి, డిపో కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలం పాట వాయిదా

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని శ్రీ మాధవ-అంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర ఆలయాలకు సంబంధించిన భూముల వేలం పాటను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఆలయ అధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు. కొద్దిరోజుల్లో వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపురం : పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రెండో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ చాంద్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా మారుతినగర్, వికలాంగుల కాలనీ, గండ్లూరు కాలనీ, బీడీ కాలనీలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని కోగటం, పందిళ్లపల్లె, చిన్నచెప్పలి, లేటపల్లె, సముద్రంపల్లె సబ్‌స్టేషన్లలో కూడా మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, రాణీవనం, వినాయకనగర్, సుందరయ్యనగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఏస్టేట్ ఏరియాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ వి. ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని 132/33 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణంగా 33/11కె.వి నల్లపురెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇ.కొత్తపల్లె, సరస్వతి మైన్స్, కదిరి రోడ్డు, సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల కు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు శనివారం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ రాజగోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భాగ్యనగరం కాలనీ, మొయిన్‌బజార్, పెద్దపసవులరోడ్డు, నాగలకట్ట, కాపువీధి, మొరగుడి గ్రామంలో ఉదయం 7 గంటల నుండి 12 గంటలవరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

జాడలేని ఆహార సలహా సంఘాలు

- రేషన్ షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- రేషన్ సరుకుల పంపిణీలో జరుగుతున్న మోసాలు
- పట్టించుకోని అధికారులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దనే రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం(ఫైల్)

సింహాద్రిపురం : రేషన్ షాపుల్లో అక్రమాలు జరగకుండా చూడటంతోపాటు నిరుపేదలకు సక్రమంగా రేషన్ అందేలా ఆహార సలహా సంఘాలు పర్యవేక్షించేవి. గతంలో ఎంతో బాధ్యతగా వ్యవహరించే సంఘాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడంలేదు. ఆహార సలహా సంఘాలు జాడ లేకపోవడంతో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రేషన్ షాపుల తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంచడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మూడు నెలలకొకసారి మండలస్థాయిలో ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమై మండల పరిధిలో ఉన్న రేషన్ షాపుల నిర్వహణ, రేషన్ పంపిణీ, సరుకుల నాణ్యత, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. సింహాద్రిపురం మండలంలో ప్రస్తుతం 32 రేషన్ షాపులు ఉండగా, దాదాపు 10వేల దాకా రేషన్ కార్డులు ఉన్నాయి. ఎనిమిది రేషన్ పంపిణీ చేసే వాహనాలు ఉన్నాయి. వీటికి ఇప్పటికీ కూడా ఒక్కొక్క వాహనానికి రూ.21వేలు ప్రభుత్వం చెల్లిస్తూ ఉంది. రేషన్ పంపిణీ చేసే వాహనాలు గ్రామాల్లో తిరగటం లేదు, దీనికి కారణం ఆహార సలహా కమిటీ సంఘం లేకపోవడంవలన, ఆహార సలహా కమిటీ సంఘాలకు చైర్మన్‌గా మండలస్థాయిలో తహసీల్దార్, జిల్లాస్థాయిలో కలెక్టర్, జేసీలు వ్యవహరించే వారు. సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకొకసారి సభ్యులు సమావేశమై ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది.

ప్రశ్నార్థకంగా రేషన్ సరుకుల నాణ్యత

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ సరుకుల నాణ్యతను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రేషన్ షాపుల్లో తూకాల్లో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ పంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ వాహనాలను కొన్ని చోట్ల నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. లోటుపాట్లపై ఎప్పటికప్పుడు సమీక్షించడం జరిగేది. సమస్యలను పరిష్కరించేవారు. ప్రస్తుతం కమిటీల ఉనికి లేకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీ అస్థవ్యస్థంగా మారింది.

– మహేశ్వరరెడ్డి, సర్పంచ్, రావులకొలను


నిత్యావసర వస్తువుల వితరణ

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి శుక్రవారం తుమ్మలపల్లె యూసీఐఎల్ పరిధిలోని ఎస్‌ఎంఎస్ కంపెనీ సీఈఓ ఖలీల్ సొదాగర్, డీజీఎం సురేష్‌బాబులు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు కిరణ్‌రెడ్డి, కేర్ టేకర్ రసూల్‌లు ఎస్‌ఎంఎస్ కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు భరోసా హామీని అమలు చేయాలి

చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వం రైతు భరోసా హామీని అమలు చేయాలని అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు రైతు భరోసా రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ నేటికి అమలు కాలేదని తక్షణమే అమలు చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గాలేరు-నగరి, తెలుగుగంగ లాంటి ప్రాజెక్టులను బడ్జెట్లో నిధులు కేటాయించి పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం చింతకొమ్మదిన్నె మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి జన్మదినోత్సవ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి మూలవిరాట్

పులివెందుల టౌన్ : పట్టణంలోని కోతి సమాధి సమీపంలో ఉన్న శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి జన్మదినోత్సవం సందర్భంగా ఆలయ నిర్వాహకుడు, గురుస్వామి వెంకట్రామిరెడ్డి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుండి పంచామృతాభిషేకంతోపాటు తోమాల అలంకరణ, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని మహా కుంభ నివేదన సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. సాయంత్రం 6 గంటలకు భక్తిశ్రద్ధలతో స్వామియే శరణం, అయ్యప్ప స్వామి శరణం అంటూ భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు.

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం 6 గంటల నుండి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి షుగర్ వ్యాధిగ్రస్తులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. షుగర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు.

రైతులకు సబ్సిడీ పైపులను అందించాలి

– సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల నిరసన



సభా భవనంలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

పులివెందుల : రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పైపులను వెంటనే అందించాలని మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు మాధవి, సౌజన్య, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, రామాంజనేయులు, రమీజాలు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరై ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి వివరించారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతుండగా రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్న తెలియజేయాలని అనడంతో మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి ఏడాది క్రితం రైతు పంటల అవసరాల కోసం నీటి తడులు అందించేందుకు సబ్సిడీ పైపులకు డీడీ చెల్లించడం జరిగిందన్నారు. కానీ ఇంతవరకు రైతులెవరికీ పైపులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి వ్యవసాయ అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో ఎంపీటీసీలతో కలిసి మండల ఉపాధ్యక్షుడితోపాటు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు సభా ప్రాంగణంలో కింద కూర్చొని నిరసన తెలిపారు. స్పందించిన ఎంపీడీఓ ఏఓ నాగలక్ష్మికి ఫోన్ చేయించి సమస్యను వివరించారు. విశ్వనాథరెడ్డి ఏఓతో ఫోన్‌లో మాట్లాడుతూ మూడు దఫాలుగా సర్వసభ్య సమావేశాలు నిర్వహించి రైతుల సమస్యను పరిష్కరించలేదన్నారు. ప్రతి సమావేశంలో పైపుల గురించి మాట్లాడితే ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. మేం రెండున్నర, మూడు ఇంచుల సబ్సిడీ పైపులకు ఏడాది క్రితం ఒక్కో పాసుపుస్తకానికి రూ.10వేలు చెల్లించడం జరిగిందన్నారు. ఇప్పుడేమో 2 ఇంచుల పైపులు ఇస్తామని చెప్పడం ఎంత వరకు సబబు అన్నారు. ఈ విషయమై డీడీ కట్టిన కంపెనీ ప్రతినిధులను అడిగితే ప్రభుత్వం ద్వారా ఎలాంటి సబ్సిడీ అందలేదని చెబుతున్నారన్నారు. అందుకు ఏఓ మాట్లాడుతూ ఈనెలాఖరులోపు సబ్సిడీ పైపులు అందేలా చూస్తామని చెప్పగా, ఈనెలాఖరులోపు రైతులకు పైపులు అందించకపోతే వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని మండల ఉపాధ్యక్షుడు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామానాయుడు, ఏపీఎం గురురాజు, ఏపీఓ పుష్పలత, రెవెన్యూ డీటీ వెంకటరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్నీ, కో ఆప్షన్ సభ్యుడు రజాక్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఈఓపీఆర్డీ శారద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



ఆర్టీపీపీలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్టీపీపీ సీఈ గౌరీపతి

పులివెందుల టౌన్ : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే అణగారిన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, అంబకపల్లె నారాయణస్వామి, సోపాల వీరా, చంద్రమౌళి, కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, సూరి, మధు, ఖాదర్, బ్యాటరీ ప్రసాద్, సంపత్, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో.. :

పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మహాత్మ జ్యోతి రావు పూలే గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక విప్లవ కారుడు అని పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి తెలిపారు. శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు పూలే 198వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని అంబేడ్కర్ సేవా సమితి నాయకులు కోలా ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ సర్కిల్ కూడలిలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : బడుగు బలహీన వర్గాల ఆశాదీపం మహాత్మ జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం ముద్దనూరు రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి నివాళులు అర్పించి మాట్లాడారు. దేశంలో ఆడపిల్లల చదువుకోసం పోరాటం చేయడంతోపాటు తన భార్య సావిత్రి బాయికి విద్యను నేర్పించి ఆడవారికి చదువు చెప్పించిన వ్యక్తి పూలే అని కొనియాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యోబు, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యులు లక్షుమయ్య, ఫయాజ్, ఎస్సీ నాయకుడు మార్బల్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ సీఈ గౌరీపతితో పాటు ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎర్రగుంట్ల పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో బీసీ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి ఘనంగా నివాలర్పించారు.

ఆడపిల్లలపై లింగ వివక్ష దుర్మార్గం



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య

తొండూరు : ఆడపిల్లలపై లింగ వివక్ష దుర్మార్గమని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య తెలిపారు. శక్రవారం ఇనగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన లింగ వివక్షత నిర్మూలన చట్టంపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గని మాట్లాడారు. ఆడ, మగ మధ్య లింగ వివక్షత సమాజ శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. స్కానింగ్ ద్వారా ఆడ పిల్ల అని తెలుసుకుని భ్రూణ హత్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లను సమాజంలో గుర్తించి సమాన విద్య, సమాన అవకాశాలు కల్పిస్తే ఆడపిల్లలు కూడా మగ పిల్లలు లాగా వృద్ధి చెందుతారన్నారు. అక్రమ భ్రూణ హత్యలను ప్రోత్సహించిన వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా, రెండవ సారి అక్రమ భ్రూణ హత్యలు చేస్తే 5 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.50 వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శిరీష, సచివాలయ, ఆరోగ్య మిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

వేంపల్లె : బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ రవి కుమార్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ సెల్, జాతీయ సామాజిక సేవా వారి ఆధ్వర్యంలో అట్టడుగు వర్గాలను ఉద్ధరించడంలో విద్య యొక్క పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాస రచన పోటీలలో 110 మంది విద్యార్థులు పాల్గొనగా.. అంబేడ్కర్ జయంతి రోజున వ్యాస రచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారని ట్రిపుల్ ఐటీ ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు దీప్తి, కోనప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడు మృతి

పులివెందుల రూరల్ : పట్టణంలోని రోటరీపురం చెందిన పసుపులేటి వెంకటరమణ తూర్పు ఆంజనేయస్వామి గుడి సమీపంలో శుక్రవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరమణకు మద్యం తాగే అలవాటు ఉందని, అప్పుడప్పుడు ఫిట్స్ వస్తూ ఉంటాయని తెలిపారు.

ముగిసిన జాబ్ మేళా

వీరపునాయునిపల్లె : డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆది త్యా బిర్లా గార్మెంట్స్ నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు మండలంలోని పలు గ్రామాల నుంచి దాదాపు 50 మంది నిరుద్యోగ మహిళలు హాజరయ్యారు. ఆది త్యా బిర్లా గార్మెంట్స్ రిక్రూట్ మెంట్ అధికారి కిరణ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ సౌకర్యాలు ఉంటాయని, కంపెనీ బస్సు సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరుకాని వారు ఉంటే వెలుగు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎంపికైన వారికి శనివారం ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని సోమవారం నుంచి విధులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. డీఆర్‌డీఏ జాబ్ మేళా కోఆర్డినేటర్ అరుణాదేవి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పిద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

వల్లూరు (చెన్నూరు) : ప్రభుత్వ బడిలో బడిఈడు పిల్లలను చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి పిలుపునిచ్చారు. చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం అనే కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలు అమలు చేయడమే తమ ప్రధాన కర్తవ్యంగా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులను కలిసి ఒప్పించి బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ బడులలో మాత్రమే చేర్పించే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ తమ వంతు కర్తవ్యంగా నెరవేర్చాలని పిలుపునిచ్చారు. మండల గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వీరనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

కమలాపురం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆయన భవన నిర్మాణ కార్మికులతో కలసి ఆందోళన నిర్వహించారు. అనంతరం అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన 600 క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణం పరిష్కరించాలన్నారు. వాటితో పాటు ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించి కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. గతంలో సంక్షేమ బోర్డు నిధులను మళ్లించారని, వాటిని తిరిగి సంక్షేమ బోర్డులో జమచేసి కార్మికులకు మెరుగైన ఫలాలు అందించాలన్నారు.

అలాగే ప్రభుత్వ పరంగానే వారికి అవసరమైన పనిముట్లు, యంత్రాలు అందించాలన్నారు. గుర్తింపు కార్డు కలిగి ఉన్న వారి ఇంట్లో మృతి చెందిన వారికి పరిహారం అందించాలన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి దీర్ఘ కాలిక వ్యా ధులు ఉన్న కార్మికులకు పింఛన్ ఇవ్వాలన్నారు. ప్ర తి మండల కేంద్రంలో కార్మికులకు ఇంటి నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలన్నారు. కార్మికులకు ఏదైన ప్రమాదాలు జరిగితే తక్షణం పరిహారం అందేలా చూడాలన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్క రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నా యకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



వేంపల్లెలో పోషకాహార దినోత్సవ ర్యాలీలో వైద్య, ఆరోగ్య అధికారులు



కొండాపురం : మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



చింతలజూటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేంపల్లె : సుఖ ప్రసవం కావడం కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం తెలిపారు. శుక్రవారం రాజీవ్ కాలనీలో 8వ గ్రామ సచివాలయంలోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో జాతీయ సురక్షిత మాతృత్వం దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువును జన్మను ఇస్తూ తల్లి మరణించరాదని, తల్లులకు, పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్య సంరక్షణ అనేది ఉండాలన్నారు. గర్భం ధరించిన తర్వాత గర్భిణులు పలు జాగ్రత్తలను తప్ప కుండా తీసుకోవాలని కోరారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందనం ప్రయోజనాలు మొదటి విడత 12 వారాల్లో పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. పేరు నమోదు చేసుకున్న తర్వాత చెకప్ చేసుకొన్న వెంటనే రూ 3 వేలు ఇస్తారన్నారు. 14 వారాల వయస్సు వరకు బిడ్డకు టీకాలు వేసిన తర్వాత రూ.6 వేలు ఇస్తారన్నారు. గర్భిణులు ప్రతి నెల 9, 10వ తేదీలలో 4వ నెల నుండి 9వ నెలవరకు తప్పని సరిగా పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రసూతి సేవలపై, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఇఓ ఫక్రుద్దీన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, సీహెచ్‌ఓ బసయ్య, అంగన్‌వాడీ టీచర్ శైలజా, ఆశాలు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పిల్లల పోషణపట్ల జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. శుక్రవారం మండలంలోని బి.కొట్టాలపల్లె, బెడుదూరు, నేదరపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణపక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు రెండేళ్ల వయసు వరకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం ఇవ్వాలన్నారు. బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు పడితే బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు, తల్లులు పోషక విలువ కలిగిన ఆకుకూరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండలంలోని చింతలజూటూరు గ్రామంలో సీడీపీఓ సునీత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం పోషకాహారంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో సమావేశమై 1000 రోజుల ప్రణాళిక, తల్లిబిడ్డ సంరక్షణ గురించి వివరించామన్నారు. పోషకాహారం, ఆరోగ్యం, పిల్లల యొక్క పోషణ స్థితిపై తల్లులకు అవగాహన కల్పించి పిల్లల సంరక్షణపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.